

మోదీ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న యాప సీతయ్య

అభివృద్ధి, సంక్షేమమే
మోదీ లక్ష్యం
బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సీతయ్య
8

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
మహబూబాబాద్
MAHABUBABAD
ఆదివారం 12 అక్టోబరు 2025



భీమునిపాదం.. పర్యాటక వినోదం..

ఆకాశంలో విరిసిన హరివిల్లు మేఘాలను మోసుకొస్తున్నట్లు.. రాళ్ల మీద నుంచి దూదిపింఁదెలు లోయలోకి దూకుతున్నట్లు 70 అడుగుల ఎత్తు నుంచి మంచుతెరలను తలపిస్తూ నీటిదారులు పడుతుంటే చూసే కన్నులకు ఎంతో హాయి. ఆకు పచ్చని ప్రకృతిలో గలగలపారే సెలయేరు. ఒక్కసారిగా మాయమై గుట్టల మీదునుంచి కిందికి జాలువారు తుంటే మనస్సు పులకరిస్తుంది. ప్రకృతి చెక్కిన కొండలు... వాటి మధ్య జలదారలు ప్రవహిస్తున్న తీరును చూసిన మది మైమరపించిపోయి పురివిప్పిన నెమలితీరు ఎగిరి గంతేయాలనిపిస్తుంది. ఈ రమణీయ దృశ్యాలకు నెలవుగా అలరారేదే భీమునిపాదం. మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం సీతానాగారం శివారు కొమ్ములవంచ పరిధి అటవీప్రాంతంలో ప్రకృతి ఒడిలో కొలువై ఉంది ఈ జలపాతం.

- ఆంధ్రజ్యోతి, గూడూరు

పచ్చని అడవిలో కొలువైన అందాల జలపాతం

- స్వచ్ఛమైన ప్రాకృతిక వాతావరణాన్ని ఆస్వాదించేందుకు అనువైన ప్రదేశం
- ఎకో టూరిజం కేంద్రంగా అభివృద్ధికి చర్యలు
- ఏటేటా పెరుగుతున్న పర్యాటకులు
- అడ్వెంచర్ టూరిజానికి సైతం అనుకూలం
- సౌకర్యాల కల్పనకు అటవీశాఖ చర్యలు

7



భీమునిపాదం ప్రాంతంలో గుట్టలను కప్పేసిన పచ్చదనం

సండే స్పెషల్ SUNDAY SPECIAL



భీమునిపాదం వద్ద నిర్మించిన పగోడ



భీమునిపాదం జలపాతం దృశ్యం



కొమ్ములవంచలో కబడ్డీ పోటీలో తలపడుతున్న బాలికల జట్టు

కొనసాగుతున్న కబడ్డీ పోటీలు

నర్సింహులపేట (మహబూబాబాద్ క్రైం) అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొమ్ములవంచలో జరుగుతున్న ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి అండర్-19 బాలబాలికల కబడ్డీ పోటీలు శనివారం రెండోరోజు హోరాహోరీగా జరిగాయి. తెలంగాణలోని ఉమ్మడి జిల్లాల పరిధిలో బాలుర నుంచి పది, బాలికల నుంచి 10 జట్లు పోటీలో పాల్గొంటున్నాయి. వీటిలో లీగ్‌మ్యాచ్‌లో బాలుర నుంచి నిజామాబాద్-హైదరాబాద్, బాలికల నుంచి నల్గొండ-నిజామాబాద్ జట్ల మధ్య పోటీ జరిగింది. ఈ పోటీలో బాలుర నుంచి హైదరాబాద్ జట్టు గెలుపొందగా, బాలికల నుంచి నల్గొండ జట్టు విజయం సాధించింది. లీగ్ మ్యాచ్‌లు పూర్తై 12న ఫైనల్ మ్యాచ్‌తో కబడ్డీ పోటీలు ముగింప చేసి విజేతలకు ప్రైజ్‌మనీతో పాటు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



బీజేపీలో చేరుతున్న వారికి పార్టీ కండువా కప్పుతున్న వల్లభు వెంకటేశ్వర్లు

బీజేపీ వైపు యువత చూపు

పార్టీ జిల్లా అధ్యక్షుడు వల్లభు వెంకటేశ్వర్లు

మహబూబాబాద్ రూరల్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : కురవి మండలం నారాయణపురం గ్రామానికి చెందిన 50 మంది యువకులు వివిధ పార్టీల నుంచి శనివారం భారతీయ జనతా పార్టీ (బీజేపీ)లో చేరారు. జిల్లా కేంద్రంలోని బీజేపీ పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు వల్లభు వెంకటేశ్వర్లు పార్టీ కండువాకప్పి, పార్టీలోకి వారిని ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ చేస్తున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులైన యువకులు బీజేపీలో చేరినట్లు చెప్పారు. భవిష్యత్తులో తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని దీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు క్యాచువల్ శ్యాంసుందర్ శర్మ, రాంచందర్‌రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి గడ్డం అశోక్ పాల్గొన్నారు.

తల్లడిల్లిన ఎంచగూడెం

- ప్రమాదవశాత్తు బావిలో పడి ఇద్దరు చిన్నారుల మృతి
- మృతులిద్దరూ అన్నాచెల్లెళ్ల కుమారులు
- కన్నీరుమున్నీరైన రెండు కుటుంబాలు



ఎంచగూడెంలో చిన్నారుల మృతదేహం వద్ద రోధిస్తున్న తల్లిదండ్రులు

కొత్తగూడ, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఒకే ఇంట్లోని అన్నాచెల్లెళ్ల కుమారులు ప్రమాదవశాత్తు ఊరి బయట బావిలో పడి మృత్యువాత పడ్డారు. ఈ హృదయ విషాదకరమైన ఘటన ఎంచగూడెంలో శనివారం జరిగింది. బంధువులు, ఎస్సై రాజ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తగూడ మండలంలోని ఎంచగూడెంకు చెందిన ఇటికాల సతీష్-స్వాతి దంపతులకు కుమారుడు ఇటికాల రితిక్ (8), కూతురు ఉన్నారు. సతీష్ నర్సపేటలోని ఓ కంగన్‌హాల్ షాపును నడుపుతున్నాడు. రితిక్ నర్సంపేట పట్టణంలోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో 4వ తరగతి చదువుతున్నాడు. ములుగు మండలం పులిగుండం గ్రామానికి పరణందుల అనిత-శ్రీనివాస్ దంపతులకు కుమారుడు జతిన్ (12), కూతురు ఉన్నారు. జతిన్ తొర్రూరులోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో 7వ తరగతి చదువున్నాడు. ఇటికాల సతీష్, పరణందుల అనిత సొంత అన్నాచెల్లెళ్లు. రితిక్, జతిన్ తల్లిదండ్రులతో కలిసి దసరా పండుగకు ఎంచగూడెంకు వచ్చారు.

తల్లిదండ్రులు పండుగ తరువాత తిరిగి వెళ్లగా శనివారం రితిక్, జతిన్‌లను గ్రామంలోనే ఉన్నారు. సతీష్, అనితల తల్లి నర్సమ్మ రితిక్, జతిన్‌లను ఇంటివద్ద ఉంచి అశోక్‌నగర్‌కు పనిమీద వెళ్లింది. తిరిగి ఎంచగూడెం వచ్చిన ఆమె ఇంటివద్ద రితిక్, జతిన్‌లు కనిపించకపోవడంతో గ్రామస్థులతో కలిసి వెతకగా గ్రామ శివారులోని ఓ బావి వద్ద వారి దుస్తులు, చెప్పులు కనిపించాయి. గామస్థులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో కొత్తగూడ, గంగారం ఎస్సైలు రాజ్‌కుమార్, రవికుమార్ సంఘటనా స్థలంకు చేరుకుని ఈతగాళ్లతో బావిలో గాలించారు. రితిక్, జతిన్ మృతదేహాలను బయటికి తీశారు. బహిర్భూమికి వెళ్లి చిన్నారులు ప్రమాద వశాత్తు బావిలోపడి మృతి చెందినట్టు భావిస్తున్నారు. ఇద్దరు చిన్నారులు మృతిచెందటంతో కుటుంబసభ్యుల రోధనలు మిన్నంటాయి.

బావిలో పడి వివాహిత మృతి

మహబూబాబాద్ క్రైం : ప్రమాదవశాత్తు బావిలో పడి ఓ వివాహిత మృతి చెందిన సంఘటన మహబూబాబాద్ పట్టణ శివారు సాంక్రియా తండాలో శనివారం వెలుగులోకి వచ్చింది. ఎస్సై గంద్రాతి సతీష్ తెలిపిన వివరాల ప్రకారం. కురవి మండలం పరిధిలోని బేతోలు శివారు సాంక్రియాతండాకు చెందిన లునావత్ విజయ (45) ఈ నెల 10న మధ్యాహ్నం వ్యవసాయ బావి మోటారు ఆన్ చేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు కాలుజారి బావిలో పడినట్లు తెలిపారు. కుటుంబసభ్యులు, స్థానికులు శ్రమించి బయటకు తీసేలోపే మృతి చెందినట్లు తెలిపారు. మృతురాలుకు కుమార్తె, కుమారుడు ఉన్నట్లు తెలిపారు. భర్త బాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చేపల వలలో చిక్కుకొని వ్యక్తి మృతి

కోయగూడెం గ్రామంలో ఘటన

బయ్యారం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదవశాత్తు చేపల వలలో చిక్కుకొని ఓ వ్యక్తి మృతి చెందగా, శనివారం కేసు నమోదు చేసి దర్యాప్తు సాగిస్తున్నట్లు ఎస్సై తిరుపతి పేర్కొన్నారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం. మహబూబాబాద్ బయ్యారం మండలం కోయగూడెం గ్రామానికి చెందిన యేపే వెంకన్న (లేట్)-లక్ష్మీ దంపతులకు ముగ్గురు కుమారులు. చిన్న కుమారుడు నాగేంద్రబాబు (25) కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలోనే శుక్రవారం సాయంత్రం సమీప చుంచుబంధంతండా చెరువులో చేపలు కోసం వలవేసి ఇంటికి వచ్చాడు. అనంతరం శనివారం ఉదయం చెరువు వద్దకు వెళ్లి వలను బయటకు లాగుతుండగా ప్రమాదవశాత్తు వలలో చిక్కుకొని నీళ్లలో మునిగిపోయాడు. చెరువు వద్దకు వెళ్లిన వ్యక్తి ఎంతకు తిరిగి రాకపోవడంతో అనుమానం వచ్చిన స్థానికులు, కుటుంబసభ్యులు చెరువులో వెతుకలాడుతుండగా నాగేంద్రబాబు నీటిలో వలలో చిక్కుకొని మునిగి ఊపిరాడక మృతి చెందినట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతి అన్న చిరంజీవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.



మృతి చెందిన నాగేంద్రబాబు

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- మొబైల్ ఫోన్‌లకు వచ్చే లింక్‌లను ఓపెన్ చేసి మోసపోవద్దు
- 'ఆన్‌లైన్' పెట్టుబడులపై ఆలోచన తప్పనిసరి
- ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్



ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్

మహబూబాబాద్ క్రైం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : కొత్త తరహా సైబర్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, మొబైల్ ఫోన్‌లకు వచ్చే లింక్‌లు, ఆకర్షణీయమైన ప్రొఫైల్స్, మ్యాట్రీమోనియల్ సైట్లలో వివాహ వాగ్దానాలు, నకిలీ ఆన్‌లైన్ పెట్టుబడి పథకాలలో పెట్టుబడిపెట్టి మోసపోవద్దని ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్ సూచించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడారు. సోషల్ మీడియా, మ్యాట్రీమోనియల్ సైట్లలో వివాహ వాగ్దానాల పేరుతో సైబర్ నేరగాళ్లు ప్రజలను మోసం చేస్తున్నట్లు వివరించారు. ఆకర్షణీయమైన ప్రొఫైల్స్, మ్యాట్రీమోనియల్ సైట్లు, సోషల్ మీడియాలో ఎన్‌ఆర్ఐ‌ఎస్, విదేశాలలో ఉండే ప్రొఫెషనల్స్‌ను సృష్టిస్తూ తరచూ ఫోన్‌లో సంప్రదింపులు చేస్తూ సైబర్ నేరగాళ్లు ప్రజలను రూ.లక్షల్లో మోసం చేస్తున్నట్లు తెలిపారు. దీనిలో భాగంగా ఇటీవల కాలంలో రాష్ట్రంలో ఓ బాధితుడి నుంచి ఆన్‌లైన్ పెట్టుబడుల పేరుతో రూ.7.7 కోట్ల మేరకు సైబర్ నేరగాళ్లు మోసం చేసినట్లు గుర్తు చేశారు. ఇలాంటి మోసాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండి సెల్‌ఫోన్‌కు వచ్చే లింక్‌లు, ఆన్‌లైన్ పెట్టుబడి పథకాలతో జాగ్రత్తగా ఉండాలన్నారు. అనుమానాస్పదమైన ఏదైనా కార్యకలాపం, మోసం జరిగినట్లైతే వెంటనే జాతీయ సైబర్ క్రైం హెల్ప్‌లైన్ 1930 ఫిర్యాదు చేయాలన్నారు.

ఆర్‌ఎస్‌ఎస్ ప్రేరణతో రాష్ట్ర సేవికా సమితి
- సమాజ నిర్మాణంలో మహిళల పాత్ర కీలకం
- ఖమ్మం విభాగ్ బౌద్ధిక్ ప్రముఖ్ కవిడి రమేష్
8

పీఎం ధన్ ధాన్య కృషి యోజన పథకం షురూ

రైతు వేదికలు, మార్కెట్‌లు, పీఏసీఎస్‌లో వేడుకలు

మహబూబాబాద్ అగ్రికల్చర్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఢిల్లీ నుంచి ప్రధానమంత్రి నరేంద్రమోదీ వర్చువల్ పద్ధతిలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రధాన మంత్రి ధన్ ధాన్య కృషి యోజన పథకాన్ని మహబూ బాబాద్‌లోని రైతువేదికలో, వ్యవసాయ మార్కెట్‌లలో, పీఏసీఎస్‌లలో శనివారం ప్రారంభించగా, అధికారులు రైతులు, ప్రజాప్రతినిధులు వీక్షించారు. జిల్లా వ్యాప్తంగా మానుకోటలోని రైతు వేదికలోనూ, మహబూబాబాద్, కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌లలో, జిల్లాలోని ప్రాథమిక సహకార సంఘాల్లోనూ వీడియో కాన్ఫరెన్స్‌ల ద్వారా మోదీ ప్రసంగాన్ని చూశారు.

జిల్లా వ్యాప్తంగా రైతు వేదికల్లో జరిగిన కార్యక్రమంలో వివిధ మండలాల నుంచి వ్యవసాయాధికారులు, ఏఈఓలు హాజరయ్యారు. జిల్లా వ్యవసాయాధికారి విజయనిర్మల, మహబూబాబాద్, మరిపెడ వ్యవసాయ సహాయ సంచాలకులు ఎ.శ్రీనివాసరావు, విజయ్‌చంద్రతో పాటు వ్యవసాయాధికారి ఎస్.తిరుపతిరెడ్డి, ఆత్మ చైర్మన్ నల్లు సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు. మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో జరిగిన కార్యక్రమంలో మార్కెట్ సూపర్‌వైజర్ రమేష్, టి.రవి, మార్కెట్ డైరెక్టర్ నర్సయ్య, రైతులు పాల్గొన్నారు. కేసముద్రం వ్యవసాయ మార్కెట్ ఆవరణలో పెద్ద స్క్రీన్ ఏర్పాటు చేశారు. మార్కెట్ చైర్మన్ గంటా సంజీవరెడ్డి, ఆర్టీఏ డైరెక్టర్ రావుల మురళి, మార్కెట్ డైరెక్టర్‌లు ఓలం రమేష్, యాదగిరి, రాము, మార్కెట్ కార్యదర్శి అమరలింగేశ్వర్‌రావు, రాజేంద్రప్రసాద్, కంచె వెంకన్న, గండి శ్రీను, పొలెపల్లి చెన్నారెడ్డి, పెదగాని రవి, పాల్గొన్నారు.



మానుకోటలోని రైతు వేదికలో పాల్గొన్న డీఏవో విజయనిర్మల

ధనసరి ప్రాథమిక సహకార సంఘంలో జరిగిన ప్రధాన మంత్రి కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ మర్రి రంగారావు, డైరెక్టర్‌లు పి.రవీందర్‌రెడ్డి, సారంగం, వీరన్న, లోక్య, ఐలయ్య, సొసైటీ సీఈవో మల్లారెడ్డి, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు. గార్ల పీఏసీఎస్‌లో జరిగిన కార్యక్రమంలో సీఈవో వెంకటేశ్వర్లు, రవి, భీముడు, రాజశేఖర్, రావోజీ, మహేష్, సాయికుమార్, ఇమ్రాన్‌ఖాన్‌తో పాటు రైతులు పాల్గొన్నారు. నెల్లికుదురు పీఏసీఎస్‌లో జరిగిన కార్యక్రమంలో సొసైటీ సీఈవో కె.శ్రీను, నాగరాజుతో పాటు రైతులు పాల్గొన్నారు. గూడూరులో పీఏసీఎస్‌లో జరిగిన కార్యక్రమంలో సీఈవో రాజేష్, సిబ్బంది రాజయ్య, హుస్సేన్, నర్సయ్య, రైతులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ చిన్నారి మృతి

నెలరోజుల క్రితం వేడినీటిలో పడిన నిహాన్సిక

సయ్యద్‌హుస్సేన్‌పల్లిలో విషాదం


నిహాన్సిక (ఫైల్)

చిలుపూర్, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి) : ప్రమాదవశాత్తు వేడినీళ్లలో పడిన చిన్నారి చికిత్స పొందుతూ మృతిచెందిన ఘటన జనగామ జిల్లా చిలుపూర్ మండలంలోని పల్లగుట్ట పరిధిలోని సయ్యద్‌హుస్సేన్‌పల్లిలో శనివారం జరిగింది. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం. గ్రామానికి చెందిన దాసరి కుమార్-చైతన్య దంపతు లకు ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తె నిహాన్సిక (3)కు నెల రోజుల క్రితం వేడినీటిలో పడి తీవ్రంగా గాయపడింది. స్నానం చేయించేందుకు ఇంటి ముందు ఉంచిన వేడినీటి టబ్బులో ప్రమాదవశాత్తు పడిపోయింది. దీంతో ఎంజీఎంకు, తర్వాత హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. పరిస్థితి విషమించడంతో మృతిచెందింది. దీంతో గ్రామంలో విషాదం నెలకొంది. ఎస్సై సిరిపురం నవీన్‌కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ఢీకొని కూలీ మృతి


రాజు (ఫైల్)

జఫర్‌గడ్, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి) : సికింద్రాబాద్‌లోని చర్లపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో రైలు ఢీ కొని జనగామ జిల్లా జఫర్‌గడ్ మండలం తిమ్మంపేటకు చెందిన కూలీ దుర్మరణం చెందాడు. బంధువుల కథనం ప్రకారం మండల రాజు (57) కూలినాలి చేసుకుని జీవిస్తున్నాడు. నాలుగు రోజుల క్రితం చర్లపల్లిలో తన స్నేహితుడి వద్దకు వెళ్లి శుక్రవారం సాయంత్రం తిరుగు ప్రయాణమయ్యాడు. రైల్వేస్టేషన్‌కు వచ్చేందుకు రైల్వే ట్రాక్ దాటుతుండగా రైలు ఢీ కొట్టింది. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పాకెట్‌లో ఉన్న ఫోన్ నంబరు ఆధారంగా కుటుంబీకులకు సమాచారమందించారు. రాజు భార్య 15 ఏళ్ల అనారోగ్యంతో చనిపోగా, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. విషయం తెలుసుకున్న తిమ్మంపేటలోని పెట్రోల్ బంకు యాజమాన్యం రూ.10వేలు ఆర్థిక సాయం అందించారు.

అడ్రస్ మరచిపోయిన వృద్ధుడు

నాలుగు రోజులుగా ఆస్పత్రి ఆవరణలోనే..


సామాజిక ప్రభుత్వ ఆస్పత్రి వద్ద వృద్ధుడు వీరస్వామి

ఏటూరునాగారం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ఎక్కడి నుంచి వచ్చాడో.. ఎక్కడికెళ్లాలో తెలియదు ఆ వృద్ధుడికి. తన పేరు మాత్రమే గుర్తుంది. అడ్రస్ మాత్రం మరచిపోయాడు. నాలుగు రోజులుగా సర్కారు దవాఖాన ఆవరణలోనే ఉంటున్నాడు. ఎండ ఎంతున్నా.. ఎంత చలి పెట్టినా అక్కడే దీన స్థితిలో గడుపుతున్నాడు. ములుగు జిల్లా ఏటూరునాగారంలోని ప్రభుత్వ సామాజిక వైద్యశాల ఆవవణలో ఈ దృశ్యం చూపరులను కలచివేస్తోంది. నాలుగు రోజులుగా ఓ వృద్ధుడు ఆస్పత్రి ఆవరణలోనే ఉంటున్నాడు. పలువురు గమనించి అతడిని పలకరించగా తన పేరు వేల్పుల వీరస్వామి అని చెప్పాడు. అయితే, తాను ఇంటి అడ్రస్ మర్చిపోయానని, అందుకే ఇక్కడే ఉంటున్నానని చెబుతున్నాడు. నాలుగు రోజులుగా తిండి అలమటిస్తున్నట్లు తెలిపాడు. ఎందుకొచ్చాడు వీరస్వామి చెప్పలేకపోతున్నాడు. అతడి చిరునామాను తెలుసుకుని కుటుంబ సభ్యులకు అప్పగించేందుకు ఆస్పత్రి సిబ్బంది, అధికారులు చొరవ తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

గొత్తికోయల జీవితాల్లో వెలుగులు

- వారి సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి
- పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క


గొత్తికోయ గ్రామంలో పాఠశాల భవనాన్ని ప్రారంభిస్తున్న సీతక్క

తాడ్వాయి, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): గొత్తికోయల జీవితాల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రజాప్రభుత్వం వెలుగులు నింపుతోందని రాష్ట్ర పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని కొండపర్తి క్రాస్ వద్ద చెన్నాపురం తోగు, జలగలంచ గుంపులో రూ. 6 లక్షలతో నిర్మించిన రెండు పాఠశాలలను కలెక్టర్ దివాకరతో కలిసి మంత్రి సీతక్క శనివారం ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ గొత్తికోయల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. వారికి అన్ని రకాల సౌకర్యాలను కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తోందని తెలిపారు. త్వరలోనే 53 గొత్తికోయగూడెల్లో సర్వే చేయించి సోలార్‌లైట్లు ఏర్పాటు చేయిస్తానని అన్నారు. గొత్తికోయగూడెల్లో రిజర్వ్ ఫారెస్టు ప్రాంతంలో ఉండటం వల్ల సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయని, వాటిని అధిగమించేందుకు కృషి చేస్తామని తెలిపారు. పాఠశాలల నిర్మాణానికి సహకరించిన అధికారులను మంత్రి అభినందించారు. కార్యక్రమంలో ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవిచందర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగా కల్యాణి, డీపీవో దేవరాజ్ తదితరులు పాల్గొన్నారు.

బస్టాండ్ పనులను పరిశీలించిన మంత్రి

ములుగు టౌన్, (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో ఆధునిక సౌకర్యాలతో నిర్మిస్తున్న బస్టాండ్ పనులను మంత్రి సీతక్క శనివారం పరిశీలించారు. మేడారం జాతర సమీపిస్తున్న నేపథ్యంలో ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, పనులను త్వరితగతిని పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. మంత్రి వెంట జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, కాంగ్రెస్ ములుగు పట్టణ అధ్యక్షుడు చింతనిప్పుల భిక్షపతి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ నల్లెల్ల భరత్, బీసీసెల్ మండల అధ్యక్షుడు పౌడాల ఓంప్రకాశ్, జిల్లా అధికార ప్రతినిధి అహ్మద్ పాషా, యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు జక్కుల రేవంత్, మాజీ ఎంపీటీసీ తిరుపతి రెడ్డి, జడ్పీ మాజీ కోఆప్షన్ సభ్యుడు రియాజ్ మిర్జా, పట్టణ యూత్ అధ్యక్షుడు అభినయ్ తదితరులు ఉన్నారు.

విద్యుత్ లైన్ ఉచ్చుకు అడవిపంది మృతి

కాటారం, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): పంటలను కాపాడుకోవడానికి ప్రధాన రహదారికి సమీపంలోనే వేసిన విద్యుత్ ఉచ్చులు వన్యప్రాణాలను బలిగొంటున్నాయి. తాజాగా భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలో అడవిపంది ఒకటి మృతి చెందింది. తరుచుగా 11కేవీ ఫీడర్‌లోనే విద్యుత్ అంతరాయాలు కలుగుతుండటంతో సంబంధి అధికారులు, సిబ్బంది తనిఖీలు చేపట్టగా ఈ విషయం వెల్లడైంది. మండలంలోని ధన్వాడ సబ్‌స్టేషన్ నుంచి గూడూరు వైపు వెళ్లే 11కేవీ ఫీడర్ పరిధిలో ధన్వాడ-గుమ్మళ్లపల్లి మధ్య వరి పొలం చుట్టూ వేసిన విద్యుత్ ఉచ్చుకు శుక్రవారం రాత్రి అడవిపంది పడి మృతిచెందిన ఘటన చోటుచేసుకుంది. గూడూరు 11కేవీ ఫీడర్ పరిధిలో తరచూ విద్యుత్ అంతరాయాలు నెలకొనడంతో రైతులు, పలు గ్రామాల ప్రజలు విద్యుత్ అధికారులు, సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఈ క్రమంలో శుక్రవారం రాత్రి సైతం 11కేవీ లైన్ ట్రిప్ కావడంతో పలువురు గూడూరు ప్రజలు విద్యుత్ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఎల్‌ఎం ప్రవీణ్, ఏఎల్‌ఎం శ్రీకాంత్, అన్‌మ్యాన్డ్ రవి తదితరులు ధన్వాడ నుంచి లైన్ వెంట తనిఖీలు చేశారు. ధన్వాడ-గుమ్మళ్లపల్లి రహదారి పక్కన ఓ పొలం వద్ద 11కేవీ లైన్‌కు తీగ తగిలించి ఉండటం గమనించి కొంత దూరం లోపలికి వెళ్లి పరిశీలించగా విద్యుత్ తీగలతో వేసిన ఉచ్చుకు అడవిపంది మృతి చెంది కనిపించింది. దీంతో అధికారులు, సిబ్బంది తీగలను తొలగించి వచ్చి సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. కాగా శనివారం ఉదయం సంఘటనాస్థలానికి విద్యుత్ సిబ్బంది వెళ్లగా అడవిపంది కళేబరం మాయం అయినట్లు గుర్తించారు. విద్యుత్ ఉచ్చులపై పోలీసులకు, విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చినట్లు ఎల్‌ఎం ప్రవీణ్ తెలిపారు. రహదారుల పక్కనే విద్యుత్ ఉచ్చులు వేయడంతో ప్రజలు, పశువులకు ప్రాణాపాయ ప్రమాదాలు ఉంటాయని పలువురు ఆందోళన చెందుతున్నారు. విద్యుత్ ఉచ్చుల నియంత్రణకు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

14న రాష్ట్ర బంద్‌ను విజయవంతం చేయాలి

ములుగు రూరల్, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్ల అంశంలో హైకోర్టు స్టే విధించిన నేపథ్యంలో ఈ నెల 14న పాటించే రాష్ట్ర బంద్‌ను విజయవంతం చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు తోటకూరి శ్రీకాంత్ గౌడ్ కోరారు. జిల్లా కేంద్రంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అంశంపై స్టే తీసుకురావడాన్ని ఖండిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం మల్లంపల్లి మండల అధ్యక్షుడు జింక వేణు, బసీ యువజన సంఘం నాయకులు పల్లెబోయిన సంతోష్, మురారి విజయ్, గందం కార్తీక్, నాగరాజు, రమేష్, తదితరులు పాల్గొన్నారు

నేడు క్రెడాయ్ రక్తదాన శిబిరం

వడ్డెపల్లి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ రెడ్ క్రాస్ సొసైటీ, వరంగల్ ఎంజీఎం ఆధ్వర్యంలో క్రెడాయ్ నేతృత్వంలో హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లోని నేరెళ్ల వేణుమాధవ్ కళా ప్రాంగణంలో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్టు క్రెడాయ్ వరంగల్ అధ్యక్షుడు నాయిని అమరేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి శాఖమూరి అమర్ తెలిపారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా చేపట్టిన ఈ కార్యక్రమం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతుందని తెలిపారు.

సమాచార హక్కు చట్టం.. బలమైన సాధనం

సింగరేణి ఏరియా జనరల్ మేనేజర్ రాజేశ్వర్‌రెడ్డి


అధికారులతో ప్రతిజ్ఞ చేస్తున్న జనరల్ మేనేజర్ రాజేశ్వర్‌రెడ్డి

కృష్ణకాలనీ, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): పారదర్శకత, జవాబుదారీతనానికి ఒక బలమైన సాధనం సమాచార హక్కు చట్టమని భూపాలపల్లి సింగరేణి ఏరియా జనరల్ మేనేజర్ ఏనుగు రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. సమాచార హక్కు చట్టం వారోత్సవం సందర్భంగా ఉద్యోగులతో కలిసి సమాచార హక్కు చట్టం ప్రాముఖ్యతపై జీఎం కార్యాలయంలో శనివారం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఇతర అధికారులతో జీఎం ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వ విధానాల గరించి సమాచారం పొందే అవకాశంగా ఈ చట్టం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఏరియాలో ఈ చట్టాన్ని అమలు చేయడంలో ఎల్లప్పుడు ముందుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ వోటూ జీఎం కవీంద్ర, అధికారులు రవికుమార్, రాజేశ్వర్, ఎర్రన్న, మారుతీ, కార్తీక్, రాజు తదితరులు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలను మానుకోవాలి

- ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రవీందర్


మహాసభలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన కార్యదర్శి రవీందర్

ఏటూరునాగారం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను తక్షణమే విరమించుకోవాలని ఏఐటీయూసీ ములుగు జిల్లా ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఏఐటీయూసీ నాయకులు వెల్దండి కొమురయ్య అధ్యక్షతన శనివారం నిర్వహించిన మండల మహాసభకు రవీందర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, కనీస వేతనం రూ. 26వేలు నిర్ణయించాలని కోరారు. కేంద్రంలోని ప్రభుత్వం కార్పొరేట్ యాజమాన్యాలకు అనుకూలంగా పనిచేస్తూ, కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను రద్దు చేసి, వాటి స్థానంలో నాలుగు కోడ్‌లను తీసుకురావడాన్ని ఖండించారు.

కేంద్ర ప్రభుత్వం వెంటనే ఈ నాలుగు కోడ్‌లను ఉపసంహరించుకొని, యథావిధిగా 44 చట్టాలను కొనసాగించాలని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ సంక్షేమ బోర్డు నిధులను దుర్వినియోగం చేస్తున్న ప్రభుత్వాలు కార్మికుల సమస్యలను పరిష్కరించడానికి కృషి చేయాలన్నారు. అనంతరం ఏఐటీయూసీ మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా పోరెడ్డి ప్రమీల, ఉపాధ్యక్షుడిగా వెల్దండి కొమురయ్య, ప్రధాన కార్యదర్శిగా ఎస్.కె. చాంద్ పాషా, సహాయ కార్యదర్శులుగా మామిడి పార్వతి, మట్టి లక్ష్మిని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి ఎమ్డీ. నాసర్, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పోలం కొండయ్య, ధానం భిక్షపతి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆటోలోనే ప్రసవం

- శిశువుకు జన్మనిచ్చిన తల్లి
- తల్లీబిడ్డ క్షేమం..

అందుబాటులో లేని అంబులెన్స్


ప్రసవం అనంతరం ఆటో వద్ద నిలబడిన మహిళ

లింగాలఘణపురం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆటోలనే గర్భిణి డెలివరీ అయిన ఘటన జనగామ జిల్లా లింగాలఘణపురంలో శనివారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే. లింగాలఘణపురంకు చెందిన గర్భిణీ మరికుక్కల కనకలక్ష్మి ఉదయం జనగామలోని చంపక్ హిల్స్ మాతాశిశు ఆస్పత్రికి వెళ్లింది. అక్కడ పరీక్షించిన వైద్యులు 13న డెలివరీ అయ్యేందుకు అవకాశం ఉందని, రెండు రోజుల తర్వాత రమ్మని సూచించారు. దీంతో తిరిగి స్వగ్రామానికి చేరుకున్న గంట తర్వాత కనకలక్ష్మికి పురిటి నొప్పులు ప్రారంభమయ్యాయి. వెంటనే ఆమె భర్త ఉపేందర్ అంబులెన్స్‌కు కాల్ చేయగా అందుబాటులో లేదని, వీలైనంత తొందరలో పంపిస్తామని సూచించారు.

సుమారు అరగంట పాటు ఎదురుచూసినా అంబులెన్స్ రాకపోవడంతో అదే గ్రామానికి చెందిన శ్రీశైలం అనే ఆటోలో జనగామ ఆస్పత్రికి తరలిస్తుండగా నెల్లుట్ల వద్ద ప్రసవం జరిగింది. ఆ సమయంలో ఆటో డ్రైవర్, కనకలక్ష్మి భర్త మాత్రమే ఉన్నారు. ఆటోడ్రైవర్ ఆటో చుట్టూ పరదలు చుట్టిన తర్వాత నెల్లుట్ల సమీపంలోని మహిళల ద్వారా అక్కడి ఆశవర్కర్ల ఆచూకీ తెలుసుకుని ఘటనా స్థలానికి తీసుకువచ్చాడు. అప్పటికే శిశువు జన్మనిచ్చింది. తల్లీ బిడ్డ ఇద్దరూ క్షేమంగానే ఉన్నారని ఆశవర్కర్లు తెలిపారు. ఇదంతా జరిగిన గంట తర్వాత అక్కడికి అంబులెన్స్ చేరుకోవడంతో తల్లీబిడ్డలను చంపక్‌హిల్స్ ఆస్పత్రికి తరలించారు. కనకలక్ష్మి, ఉపేందర్ దంపతులకు తల్లిదండ్రులు ఎవరూ లేకపోవడంతో పురిటినొప్పుల సమయంలో ఆమెకు తోడుగా మహిళలు ఎవరూ లేకుండా పోయారు. వీరికి మూడేళ్ల కూతురు ఉంది.

పోలీస్‌స్టేషన్‌లో శ్రమదానం


శ్రమదానం చేస్తున్న డీఎస్పీ సూర్యనారాయణ, ఎస్సై శ్రీనివాస్, సిబ్బంది

కాటారం, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): కాటారం పోలీస్‌స్టేషన్‌లో శనివారం పచ్చదనం-పరిశుభ్రత కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది. డీఎస్పీ అమరగాని సూర్యనారాయణ నేతృత్వంలో పోలీస్ అధికారులు, సివిల్, టీజీఎస్పీ బలగాలు, హోంగార్డులు, జీపీ పారిశుధ్య సిబ్బంది శ్రమదానం చేశారు. స్టేషన్ ఆవరణ, బయట ఉన్న చెత్తాచెదారాన్ని, గడ్డి, పిచ్చి మొక్కలను తొలగించారు. పూల మొక్కల చుట్టూ శుభ్రం చేసి కర్రలు పాతారు. స్టేషన్ రూఫ్‌టాప్‌పై శుభ్రం చేసి వర్షం నీరు నిల్వకుండా ఎప్పటికప్పుడు కిందకి వెళ్లేలా చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా డీఎస్పీ సూర్యనారాయణ మాట్లాడుతూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటిస్తే పలు వ్యాధులు దరిచేరవన్నారు. పచ్చదనం-పరిశుభ్రతతో పర్యావరణం పరిరక్షణ జరుగుతుందన్నారు. పోలీసులు నిరంతరం శాంతిభద్రతల పరిరక్షణతో పాటు పచ్చదనం-పరిశుభ్రతపై దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై శ్రీనివాస్, ఎస్సై-2 రాజశేఖర్, ఎస్సై-3మానస, హెడ్ కానిస్టేబుల్స్ కానిస్టేబుల్స్ సిబ్బంది పాల్గొన్నారు.

కె-హబ్‌తో టి-హబ్ అవగాహన ఒప్పందాలు

- రాష్ట్ర ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు
- నాంపల్లిలో కేయూ ఫార్మసీ స్వర్ణోత్సవ సంబురాలు

కేయూ క్యాంపస్ అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): వరంగల్‌లోని కాకతీయ యూనివర్సిటీ కె-హబ్‌తో హైదరాబాద్‌లోని టి-హబ్ పరస్పర అవగాహన ఒప్పందాలు జరుగుతాయని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. శనివారం హైదరాబాద్‌లోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో కేయూ ఫార్మసీ కళాశాల స్వర్ణోత్సవ సంబరాలు జరిగాయి. ఈ వేడుకలకు మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. వరంగల్‌లో ఆవిష్కరణలు, ఇంక్యూబేషన్ స్టార్టప్‌లకు హబ్‌లుగా అభివృద్ధి చేయడానికి ప్రోత్సహించనున్నట్లు తెలిపారు. పూర్వ విద్యార్థుల మద్దతులో కేయూ గత వైభవాన్ని సాధిస్తోందన్నారు. దేశంలో టాప్-10 కళాశాలల్లో కేయూ ఫార్మసీ కళాశాలలో ఒక్కటిగా నిలిచిందన్నారు. వర్సిటీ అభివృద్ధికి పూర్వ అధ్యాపకులు, విద్యార్థుల పాత్ర గొప్పదన్నారు.

రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. కేయూ పేరు ప్రఖ్యాతులను, కీర్తిని ప్రశంసించారు. కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ.. రూసాతో పాటు ఇతర సంస్థల సహకారంతో వర్సిటీ ఫార్మసీ కళాశాలలను మరింత అభివృద్ధి చేస్తామన్నారు. 600 మంది కేయూ ఫార్మసీలో పీహెచ్‌డీ డిగ్రీలు సాధించారని పేర్కొన్నారు. వర్సిటీ ఫార్మసీ కళాశాల స్కాలర్స్, అధ్యాపకులు స్టార్టప్ వ్యవస్థాపకులు, వ్యాపార వేత్తలుగా, ప్రభుత్వ యంత్రాంగంలో ఉన్నతస్థాయిలో పనిచేస్తున్నారని కొనియాడారు. డిసెంబర్‌లో రాష్ట్రస్థాయి హ్యాకథాన్‌లను నిర్వహిస్తామన్నారు. గత సెప్టెంబరులో కేయూ ఫార్మసీ కళాశాలతో పాటు యూఎస్ఏలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించామనారు. డిసెంబరులో వర్సిటీలో మెగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరగనుందన్నారు. అనంతరం కేయూ ఫార్మసీ పూర్వ విద్యార్థుల సావనీర్‌తోపాటు మరో రెండు పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కేయూ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణవేణితో పాటు ఫార్మసీ అల్యూమినీ బాధ్యులు, ప్రముఖులు పాల్గొన్నారు.

నేడు ఆర్టీసీ డిపో సందర్శనకు ఎం.డి. నాగిరెడ్డి

హనుమకొండ టౌన్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఆర్టీసీ) మేనేజింగ్ డైరెక్టర్ వై.నాగిరెడ్డి ఆదివారం హనుమకొండ ఆర్టీసీ ఆర్ఎం కార్యాలయ సందర్శనకు వస్తున్నట్లు వరంగల్ ఆర్ఎం డి.విజయభాను శనివారం తెలిపారు. ఇటీవలే ఆర్టీసీ ఎం.డి.గా బాధ్యతలు స్వీకరించిన వైనాగిరెడ్డి.. తొలిసారిగా వరంగల్ రీజినల్ కార్యాలయానికి వస్తున్నారు. ఈ సందర్శనలో బస్సుల నిర్వహణ, డిపో పరిసరాల పరిశుభ్రత, వాహనాల స్థితి, డ్రైవర్లు, కండక్టర్లు, సిబ్బంది సమస్యలపై అధికారులతో సమీక్ష జరుపనున్నట్లు ఆర్ఎం తెలిపారు. అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి రవాణా సేవల మెరుగుదల, ఆదాయం పెంపు, ప్రయాణికుల సౌకర్యాలపై చర్చిస్తారని ఆర్ఎం తెలిపారు. ఎం.డి. పర్యటన సందర్భంగా ఆర్టీసీ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.



కనువిందు చేస్తున్న భీముని పాదం జలపాతం

భీముని పాదం.. పర్యాటక వినోదం

» పచ్చని అడవిలో కొలువైన అందాల జలపాతం
» ఏటేటా పెరుగుతున్న పర్యాటకులు

(ఆంధ్రజ్యోతి, గూడూరు)

మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం సీతానగారం శివారు కొమ్ములవంచ పరిధిలోని దట్టమైన అటవీప్రాంతంలో ఉన్న భీమునిపాదం జలపాతం రెండు దశాబ్దాల కాలంలో బహుళ ప్రాచుర్యంలోకి వచ్చింది. సందర్శకుల తాకిడి క్రమంగా పెరిగింది. అక్కడ సౌకర్యాలు ఏర్పాటు దిశగా అటవీశాఖ దృష్టిసారించింది. సెలవు దినాల్లో.. వర్షాకాలంలో ఉధృతంగా జలపాతం దూకి పడే సమయంలో పెద్ద సంఖ్యలో సందర్శకులు రావడం, పొద్దంతా అక్కడ అనందంగా గడుపుతారు.

గూడూరు అభయారణ్యంలోని వన్యప్రాణి విభాగం పరిధిలో ఉన్న ఈ భీమునిపాదం కోసం అటవీశాఖ పలు అభివృద్ధి పనులు చేపట్టింది.. పదేళ్ల క్రితమే భీమునిపాదం ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో అప్పటి ప్రభుత్వంలో లోటస్ ఇంజనీరింగ్ కన్సల్టెన్సీ ఆధ్వర్యంలో మౌలిక వసతుల ఏర్పాటు కోసం సర్వే నిర్వహించారు. ఆ తర్వాత స్థానిక అటవీ అధికారులు రూ.2.80 కోట్ల అంచనా వ్యయంతో అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రణాళిక సిద్ధం చేసి సమర్పించారు. ఈ క్రమంలో గత సంవత్సరం గూడూరు అటవీశాఖ ఆధ్వర్యంలో పలు నిర్మాణ పనులు చేపట్టారు. భీమునిపాదం జలపాతం వద్దకు వెళ్లే దారిలో ఆకర్షనీయంగా ఆర్చి ఏర్పాటు చేశారు. జలపాతం సమీపంలో సందర్శకుల సౌకర్యం కోసం మూడు షెడ్డులు, టాయిలెట్స్ నిర్మించారు. కనువిందు చేసే జలపాతంను సందర్శకులు కనులారా తిలకించేందుకు ఒక పగోడ (వాచ్‌టవర్) కూడ నిర్మించారు. తాగునీటి సౌకర్యం కోసం నల్లాలు ఏర్పాటు చేసినప్పటికి వాటిని వినియోగంలోకి తెచ్చే దశలో కొన్ని పనులు మిగిలిపోయినట్లు తెలిసింది. ఇప్పటి వరకు రూ.54 లక్షలు ఈ పనుల కోసం వెచ్చించిన అధికారులు భవిష్యత్‌లో మరెన్నో పనులు చేపట్టే దశగా చర్యలు చేపడుతున్నట్లు సమాచారం.

ముందుగా అందజేసిన ప్రణాళిక ప్రకారం.. జలపాతం ప్రాంతంలో సందర్శకుల వినోదం కోసం ఒక బటర్‌ఫ్లై పార్కు, చిన్న పిల్లల కోసం స్విమ్మింగ్ పూల్, జలపాతం పైభాగంలో కూడ ఒక వాచ్‌టవర్ నిర్మాణం, సందర్శకులు కూర్చుని సేద తీరేందుకు కుర్చీలు, బెంచీలు ఏర్పాటు దశగా దృష్టి సారిస్తున్నట్లు తెలిసింది. అయితే చేసిన పనుల బిల్లుల చెల్లింపులో చోటు చేసుకుంటున్న జాప్యం కారణంగా ఈ పనులు చేపట్టేందుకు స్థానిక అటవీ అధికారులు కొంతమేర వెనుకడుగు వేస్తున్నట్లు సమాచారం. మరోపక్క స్వచ్ఛ్ భీమునిపాదం పేరుతో ప్లాస్టిక్ వ్యర్థాలను అటవీశాఖ అధికారులు, సిబ్బంది ఎప్పటికప్పుడు తొలగిస్తున్నారు. దీంతో పాటు ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించేలా అవగాహన కల్పిస్తున్నారు.



భీమునిపాదం గుట్టలను కమ్మేసిన మేఘాలు

ఎకో డెవలప్‌మెంట్ కమిటీ

భీమునిపాదం జలపాతం వద్ద సందర్శకుల సౌకర్యం కొరకు పెద్దమొత్తంలో వెచ్చించిన అటవీశాఖ నిర్వహణ దిశగా అడుగులు వేసింది. ఈ మేరకు ఎకో డెవలప్‌మెంట్ కమిటీని ఏర్పాటు చేసి నిర్వహణ బాధ్యతను వారికి అప్పగించింది. ఇందులో అదే గ్రామానికి చెందిన వ్యక్తులు చైర్మన్, వైస్ చైర్మన్‌గా బీట్ అధికారి పర్యవేక్షకుడిగా నియమించారు. జలపాతం వద్దకు వచ్చే సందర్శకుల నుంచి రుసుము రూపంలో వసూలు చేసే మొత్తాన్ని నిర్వహణ వ్యయం కొరకు ఏడీసీ ఆధ్వర్యంలో వెచ్చిస్తున్నారు. అక్కడ పనుల నిర్వహణ కొరకు ఆరుగురు వాచ్‌మెన్‌లను నియమించి ఏడీసీ ద్వారానే వారికి వేతనాలు చెల్లిస్తున్నారు.

వర్షాకాలం ఆరంభం తర్వాత నాలుగు నెలల పాటు సందర్శకుల రద్దీ ఎక్కువగా ఉన్న సమయంలో ఆశించిన స్థాయిలో ఆదాయం సమకూరుతున్నట్లు తెలిసింది. సందర్శకులకు ఒక్కొక్కరికి రూ.40 చొప్పున రుసుము వసూలు చేస్తున్నారు. ఆర్చి లోపలికి.. జలపాతం సమీపం వద్దకు వాహనాలను అనుమతించేందుకు రుసుము వసూలు చేస్తున్నారు. ద్విచక్రవాహనంకు రూ.20, త్రీ వీలర్‌కు రూ.50, ఫోర్ వీలర్స్‌కు రూ.100, సిక్స్ వీలర్స్‌కు రూ.200 చొప్పున నిర్ణయించి వసూలు చేస్తున్నారు. ఇంత వరకు బాగానే ఉన్న ఈ ప్రాంతానికి రెండు వైపుల నుంచి వచ్చే రోడ్డుమార్గం మాత్రం గుంతలమయంతో అధ్వానంగా ఉండడంతో పర్యాటకులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. ఆర్చి నుంచి జలపాతం వరకు కూడ కంకర రోడ్డును బీటీరోడ్డుగా అభివృద్ధి చేయడంతో పాటు భీముని పాదం వద్దకు వెళ్లే రెండు వైపుల ఉన్న రోడ్లను మరమ్మతులు చేయాలని సందర్శకులు కోరుతున్నారు.

భీముని పాదంకు అరుదైన గుర్తింపు

బి.సురేష్, రేంజ్ అధికారి, గూడూరు



తెలంగాణ రాష్ట్రంలో మహబూబాబాద్ జిల్లాలోని భీమునిపాదం జలపాతానికి అరుదైన గుర్తింపు ఉంది. జీవవైవిధ్యానికి నెలవుగా బాసిల్లుతుంది. అటవీశాఖ ఉన్నతాధికారులు సైతం సందర్శించి వెరీగుడ్ అని కితాబునిచ్చారు. స్వచ్ఛ్ భీమునిపాదం పేరుతో ప్లాస్టిక్ వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగిస్తున్నాం. నిధుల కోసం నివేదికలను అధికారులకు సమర్పించాం. నిధులు రాగానే అభివృద్ధి పనులను ప్రారంభిస్తాం.

చేరుకునేది ఇలా..

భీముని పాదం జలపాతంకు వెళ్లేందుకు వరంగల్ నగరానికి 52 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. గూడూరు నుంచి 9 కిలో మీటర్ల దూరం ఉంటుంది. ఇక్కడికి చేరుకోవడానికి మూడు మార్గాలు ఉన్నాయి. నర్సంపేట నుంచి భూపతి పేట బస్టాండ్.... సీతానాగారం... కొమ్ములవంచ మీదుగా వెళ్లవచ్చు. గూడూరు నుంచి చంద్రుగూడెం... లైన్‌తండ... వంపుతండ... మీదుగా భీమునిపాదంకు చేరుకోవచ్చు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుంచి వెళ్లాలనుకునే వారు ఇల్లందు... కొత్తగూడ మండలం బత్తులపల్లి... గోపాలపురం నుంచి భీముని పాదంకు చేరుకోవచ్చు.



భీమునిపాదానికి వెళ్లే ప్రధాన ద్వారం



భీమునిపాదం వద్ద నిర్మించిన కాటేజ్‌లు

బాక్సింగ్ రింగు అందించడానికి కృషి

» 'కుడా' చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి
» సందడిగా రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్‌ఐ బాక్సింగ్ పోటీలు
» రెండు రోజుల పాటు క్రీడలు, హాజరైన 180 బాక్సర్లు

వరంగల్ స్పోర్ట్స్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): బాక్సర్లకు అనువుగా ఉండే అధునాతన సౌకర్యాలు కలిగిన బాక్సింగ్ రింగు అందించడానికి కృషి చేస్తానని కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి హామీ ఇచ్చారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జీఎఫ్‌ఐ) అండర్-17 ఆధ్వర్యంలో హనుమకొండలోని డీఎస్‌ఏ బాక్సింగ్ హాల్లో ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి అండర్-17 బాలబాలికల బాక్సింగ్ పోటీలను కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులను రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రోత్సహిస్తోందన్నారు. అంతర్జాతీస్థాయి బాక్సింగ్ పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబర్చిన క్రీడాకారులకు స్వతహాగా ఆర్థిక సహాయాన్ని అందించి ప్రోత్సహిస్తానని వెంకట్రామిరెడ్డి హామీ ఇచ్చారు.

ఎస్‌జీఎఫ్‌ఐ అండర్-17 క్రీడా పోటీల నిర్వహణ జిల్లా కార్యదర్శి వి.ప్రశాంత్ మాట్లాడుతూ.. రెండు రోజుల పాటు డీఎస్‌ఏ బాక్సింగ్ హాల్లో రాష్ట్రస్థాయిలో నిర్వహించనున్న అండర్-17 బాలబాలికల బాక్సింగ్ పోటీల్లో రాష్ట్రంలోని ఉమ్మడి పది జిల్లాల నుంచి 80మంది బాలికలు, 100మంది బాలురు, 30మంది కోచ్‌లు, మేనేజర్లు పాల్గొన్నారన్నారు. ఇందులో పాల్గొనే క్రీడాకారులకు, కోచ్‌లకు, మేనేజర్లకు భోజన వసతితో పాటు సమీపంలోని ప్రభుత్వ పాఠశాలలు, నగరంలోని పలు హోటల్‌ల్లో బస సౌకర్యం కల్పించామన్నారు.



రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలను ప్రారంభిస్తున్న కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి

ఇక్కడ రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు త్వరలో ఎస్‌జీఎఫ్‌ఐ అండర్-17 ఆధ్వర్యంలో అరుణాచల్‌ప్రదేశ్‌లో నిర్వహించనున్న జాతీయస్థాయి అండర్-17 బాలబాలికల బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపిక చేస్తామన్నారు.

ఈ సందర్భంగా ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొన్న ఆర్మీ జవాన్ రాజీని కుడా చైర్మన్ వెంకట్రామిరెడ్డితో పాటు నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి డీవైఎస్‌వో రఘు, ఎస్‌జీఎఫ్‌ఐ అండర్-19 క్రీడా పోటీల నిర్వహణ జిల్లా కార్యదర్శి నరెడ్ల శ్రీధర్, సీఐ కాశీరాం, ఇండియా బాక్సింగ్ కోచ్ ఆనంది భాస్కర్, ఒలంపిక్ అసోసియేషన్ జిల్లా మాజీ కార్యదర్శి మంచాల స్వామి చరణ్, స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ (ఎస్‌ఏపీఈ)లు ఎస్.పార్థసారథి, కె.మల్లారెడ్డి, వివిధ జిల్లాలకు చెందిన కోచ్‌లు, మేనేజర్లు, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

పంట రక్షణకు ఎలుగుబంటి వేషధారణ

తొర్రూరు రూరల్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : కోతుల బారి నుండి తన పంటను రక్షించుకోవడానికి వినూత్నమార్గం ఎంచుకున్నాడు ఓ రైతు. మండలంలోని మడిపల్లి గ్రామానికి చెందిన సిరబోయిన శ్రీను అనే రైతుకు చెందిన 8 ఎకరాల పత్తి, 2 ఎకరాల వరి పంటలో కోతులు పడి ధ్వంసం చేస్తున్నాయి. వాటిని రోజు గుల్లేరు, వడిసెలతో తరిమేస్తుండగా మనుషుల మీదకి వచ్చి గాయపరుస్తున్నాయి. దీంతో కోతులను తరిమేసి పంటను రక్షించుకోవడానికి రూ.2వేలతో ఎలుగుబంటి దుస్తులను ఆన్‌లైన్ ద్వారా తెప్పించుకున్నాడు. ఎలుగుబంటి డ్రెస్ వేసుకొని తొర్రూరు-మహబూబాబాద్ రహదారి వెంట సంచరిస్తుండటంతో కోతులు పారిపోతున్నాయని శ్రీను తెలిపాడు. రహదారి వెంట వెళ్లే వాహనదారులు, గ్రామస్థులు శ్రీను ప్రయత్నాన్ని ఆసక్తిగా చూస్తూ అభినందిస్తున్నారు.



ఎలుగుబంటి వేషధారణలో రైతు శ్రీను

అంతర్జాతీయ స్థాయి విద్యా సంస్థగా ఎస్సార్‌యూకు గుర్తింపు

• ది వరల్డ్ యూనివర్సిటీ ర్యాంకింగ్స్-2026లో చోటు
• అమెరికా తర్వాత భారత్‌కు రెండో స్థానం
• గ్లోబల్ జాబితాలో ఎస్సార్‌యూ భారతదేశంలో టాప్-28
• ప్రైవేటు విశ్వవిద్యాలయాల్లో 10వ స్థానం
• ఎస్సార్‌యూ చాన్స్‌లర్ ఎ.వరదారెడ్డి

హసన్‌పర్తి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ స్థాయి విద్యా సంస్థగా ఎస్సార్ విశ్వవిద్యాలయం గుర్తింపు పొందినట్లు ఎస్సార్ విశ్వవిద్యాలయం చాన్స్‌లర్ ఎ.వరదారెడ్డి అన్నారు. మండలంలోని అనంతసాగర్‌లో గల ఎస్సార్ విశ్వవిద్యాలయం ఆవరణలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రానికి గర్వకారణంగా ఎస్సార్ విశ్వవిద్యాలయానికి ప్రపంచ ప్రఖ్యాత టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ (ది) వరల్డ్ యూనివర్సిటీ ర్యాంకింగ్స్ 2026లో 801-1000 బ్యాండ్లో స్థానం సంపాదించిందని తెలిపారు. భారతదేశంలోనే అనతి కాలంలో తొలి అంతర్జాతీయ ర్యాంకింగ్ విజయంగా ఎస్సార్‌యూ నిలిచిందన్నారు. ఈ గ్లోబల్ ర్యాంకింగ్‌లో చోటు దక్కిన ఏకైక విశ్వవిద్యాలయంగా ఎస్సార్‌యూ గుర్తింపు పొందడం హర్షనీయమన్నారు. దేశంలోనే అతి తక్కువ వ్యవధిలో న్యాక్ అక్రిడిటేషన్ పొందిన విశ్వవిద్యాలయంగా గుర్తింపు పొందిందన్నారు. ది ఇంటర్ డిసిప్లినరీ సైన్స్ ర్యాంకింగ్స్ 2025లో ప్రపంచ స్థాయిలో 401-500 బ్యాండ్, భారతదేశంలో 65 యూనివర్సిటీలలో ఒకటన్నారు. ఇటీవల వెలువడిన ఎన్ఐఆర్ఎఫ్-2025 ర్యాంకింగ్స్‌లో కూడా ఎస్సార్ యూనివర్సిటీ ఇంజనీరింగ్ విభాగంలో 91వ స్థానం, విశ్వవిద్యాలయం విభాగంలో 101-105 బ్యాండ్‌లో నిలిచిందని తెలిపారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో ఈ స్థిరమైన ప్రదర్శన, విద్యా ప్రామాణికత, పరిశోధనా నూతనత, నాణ్యమైన బోధన పట్ల ఎస్సార్‌యూ నిబద్ధతను ప్రతిబింబిస్తుందన్నారు. టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ (ది) ర్యాకింగ్స్ ప్రపంచ వ్యాప్తంగా విశ్వవిద్యాలయ ప్రదర్శనను అంచనా వేయడానికి అత్యంత విశ్వసనీయమైన ప్రమాణాలుగా పరిగణించబడుతాయని తెలిపారు. బోధన, పరిశోధన, సైటేషన్స్, అంతర్జాతీయ దృష్టి కోణం, ఇండస్ట్రీ ఇన్‌కం వంటి ఐదు ప్రధాన విభాగాల ఆధారంగా 17 సూచికల ద్వారా ఈ ర్యాంకింగ్స్ ప్రకటించబడుతాయన్నారు. 2026 ఎడిషన్ జెడ్డా, సౌదీ అరేబియాలో జరిగిన వరల్డ్ అకడమిక్ సమ్మిట్‌లో విడుదలైందని ఎ.వరదారెడ్డి తెలిపారు. అమెరికా తర్వాత అత్యధిక విశ్వవిద్యాలయాలు ర్యాంక్ పొందిన దేశంగా భారత్ రెండో స్థానంలో నిలిచిందన్నారు. ఈ జాబితాలో ఎస్సార్ యూనివర్సిటీ భారతదేశంలో టాప్-28, ప్రైవేటు విశ్వవిద్యాలయాల్లో 10వ స్థానం, తెలంగాణలో టాప్ 100లో చోటు దక్కిన ఏకైక ప్రైవేటు యూనివర్సిటీగా ఎస్సార్‌యూ నిలిచిందన్నారు. ఎస్సార్‌యూ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ దీపక్ గార్గ్ మాట్లాడుతూ ఈ ర్యాంకింగ్ ఎస్సార్‌యూ యొక్క బలమైన విద్యా ప్రాతిపదిక, అంతర్జాతీయ దృష్టి కోణానికి నిదర్శనమన్నారు. ఈ సమావేశంలో ఎస్సార్‌యూ ప్రో వైస్ చాన్సలర్ వి.మహేష్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.వి.రమణరావు, గ్రోత్ ఆపరేషన్స్ డీన్ డాక్టర్ ఆర్.అర్చనారెడ్డి, ఐక్యూఏసీ డైరెక్టర్ ప్రొఫెసర్ పి.వి.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సార్ విశ్వవిద్యాలయం చాన్స్‌లర్ వరదారెడ్డి

నేడు సాహిత్య ఆవిష్కరణల సందడి

- 'ఆరెపల్లి మట్టిబిడ్డలు' పుస్తకం..

వడ్డెపల్లి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): సీనియర్ జర్నలిస్టు నాగబెల్లి జితేందర్ రచించిన 'ఆరెపల్లి మట్టిబిడ్డలు' పుస్తకావిష్కరణ కార్యక్రమం ఆదివారం ఉదయం 10 గంటలకు జరుగుతుందని కన్వీనర్ రాకేష్‌ఖాను, కోకన్వీనర్ రఘువీర్ తెలిపారు. హనుమకొండ ఆరెపల్లి గ్రామంలోని సరళి అభ్యసన కేంద్రంలో ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ పుస్తకాన్ని ఆంధ్రజ్యోతి పూర్వ సంపాదకులు కె.శ్రీనివాస్-సుధ దంపతులకు అంకితమిస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో పలువురు సాహితీవేత్తలు, ప్రముఖులు పాల్గొంటారని తెలిపారు. సాహితీ, కళాభిమానులు, జర్నలిస్టులు, హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ సమావేశంలో జితేందర్, దినేష్, గోపాల్, రవీందర్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

మిడ్‌కో సమగ్ర సాహిత్యం..

హనుమకొండ కల్చరల్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): కడవెండి ముద్దుబిడ్డ, ఉద్యమ చరిత్రలో చెరిగిపోని ముద్ర వేసిన గుముడవెల్లి రేణుక (మిడ్ కో) సమగ్ర సాహిత్యం ఆవిష్కరణోత్సవ సభ హనుమకొండలోని హరిత కాన్ఫరెన్స్ హాల్‌లో ఆదివారం ఉదయం 10 గంటలకు జరగనున్నట్లు కార్యక్రమ నిర్వాహకుడు దొడ్డి కొమురయ్య ఫౌండేషన్ పక్షాన ఆస్నాల శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వరలక్ష్మి, ప్రొఫెసర్ సూరెపల్లి సుజాత, గోరటి అరుణ, రమక్క, ఆస్నాల విమల, శాకమూరి రవి, డాక్టర్ ఏరుకొండ నర్సింహుడు తదితర ప్రముఖులు పాల్గొంటారు.

పుంజుతోక కవితా సంకలనం..

హనుమకొండ కల్చరల్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని వాగ్దేవి కళాశాల ఆడిటోరియం వేదికగా విశ్రాంత ఐపీఎస్ అధికారి కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి రాసిన పుంజుతోక కవితా సంకలన ఆవిష్కరణ ఆదివారం ఉదయం జరగనుంది. ప్రముఖ నవలాకారుడు అంపశయ్య నవీన్ అధ్యక్షతన జరిగే కార్యక్రమంలో వరంగల్ సీపీ సన్‌ప్రీత్ సింగ్ ఆవిష్కరిస్తారు. కాళోజీ ఫౌండేషన్ అధ్యక్షుడు నాగిళ్ల రామశాస్త్రి, కార్యదర్శి వీఆర్.విద్యార్థి, ఆచార్య బన్న అయిలయ్య, మల్యాల మనోహర్‌రావు తదితర సాహితీ ప్రముఖులు పాల్గొంటారు.

ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ సస్పెన్షన్

నల్లబెల్లి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం గోవిందాపురం ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ శోభన్‌బాబును సస్పెండ్ చేసినట్లు నర్సంపేట ఎఫ్ఆర్వో రవి కిరణ్ తెలిపారు. శోభన్‌బాబు పోడు రైతులతో కుమ్మక్కై వారి వద్ద డబ్బులు తీసుకొని అడవిలోని చెట్లను నరికించారని ఆరోపణలు వచ్చాయన్నారు. ఈ క్రమంలో గోవిందాపురం బీట్ పరిధిలోని ప్రాంతాన్ని క్షుణ్ణంగా పరిశీలించి, పోడు రైతులతో మాట్లాడామని తెలిపారు. బీట్ అధికారికి డబ్బులు ఇచ్చినట్టు పోడు రైతులు వాంగ్మూలం ఇచ్చారని వివరించారు. ఈ విషయమై జిల్లా ఫారెస్ట్ అధికారి డీఎఫ్ఓ అనూజ్ అగర్వాల్‌కు నివేదికను సమర్పించగా, ఆయన బీట్ అధికారి శోభన్‌బాబును సస్పెండ్ చేస్తూ జారీ చేశారని రవికిరణ్ తెలిపారు.

ఈ నెల 14 నుంచి పలు రైళ్లు రద్దు

- మరికొన్ని దారి మళ్లింపు

డోర్నకల్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : డోర్నకల్ జంక్షన్-పాపటపల్లి రైల్వేస్టేషన్‌ల మధ్య ఉన్న మూడోలైన్ అనుసంధానిస్తూ ఉన్న డోర్నకల్ బైపాస్‌లైన్ వద్ద నాన్ ఇంటర్ లాకింగ్ పనులు ప్రారంభం కానున్ననేపథ్యంలో ఈ నెల 14వ తేదీ నుంచి 18 వరకు ఆ సెక్షన్‌లో డోర్నకల్ రైల్వే స్టేషన్ మీదుగా ప్రయాణించే పలు ప్యాసింజర్, ఎక్స్‌ప్రెస్ రైళ్లను రద్దు చేస్తున్నట్లు దక్షిణమధ్య రైల్వే శనివారం ఒక ప్రకటన విడుదల చేసింది. రైలు నెంబర్ 67765 కాజీపేట -డోర్నకల్, (67766) డోర్నకల్- కాజీపేట ప్యాసింజర్ రైలు, (67767) డోర్నకల్-విజయవాడ, (67768) విజయవాడ-డోర్నకల్ ప్యాసింజర్, (67216) భద్రాచలంరోడ్-విజయవాడ, (67215) విజయవాడ-భద్రాచలం రోడ్, (12705) గుంటూరు-సికింద్రాబాద్, (12706) సికింద్రాబాద్ ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్, (12713) విజయవాడ-సికింద్రాబాద్, (12714) శాతవాహనలను రద్దు చేశారు. గుంటూరు-సికింద్రాబాద్, సికింద్రాబాద్-గుంటూరు గోల్కొండ ఎక్స్‌ప్రెస్(17201/02)ను కాజీపేట-గుంటూరు స్టేషన్‌ల మధ్య పాక్షికంగా రద్దు చేశారు. (17406) ఆదిలాబాద్-తిరుపతి కృష్ణఎక్స్‌ప్రెస్, 13, 16, 17 తేదీల్లో గంటన్నర పాటు ఆలస్యంగా, (20833) విశాఖపట్టణం- సికింద్రాబాద్, (20834) సికింద్రాబాద్-విశాఖపట్టణం 15,16,18 తేదీల్లో 75 నిమిషాల పాటు ఆలస్యంగా బయలుదేరుతుంది. అదే విధంగా (22849) షాలిమార్-సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్‌ను, (17205) సాయినగర్ షిర్డీ-కాకినాడ పోర్టు రైలును 16న విజయవాడ-గుంటూరు, పగిడపల్లి మీదుగా, కాకినాడ పోర్టు -సాయినగర్ ఎక్స్‌ప్రెస్(17206)ను పోర్టులను విజయవాడ, గుంటూరు, పగిడిపల్లి స్టేషన్‌ల మీదుగా దారి మళ్లించారు. (11019) సీఎస్‌టీ ముంబై-భువనేశ్వర్ కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌ను 16, 17 తేదీల్లో సికింద్రాబాద్ పెగిడపల్లి, గుంటూరు, విజయవాడ మీదుగా(11020) భువనేశ్వర్-సీఎస్‌టీ ముంబై కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌ను 17, 18 తేదీల్లో సికింద్రాబాద్, పెగిడపల్లి, గుంటూరు, విజయవాడ మీదుగా దారి మళ్లింపు, (18045) షాలిమార్-చర్లపల్లి 16,17 తేదీల్లో సికింద్రాబాద్ పెగిడపల్లి, గుంటూరు, విజయవాడ మీదుగా, (18046) చర్లపల్లి-షాలిమార్ ఎక్స్‌ప్రెస్‌ను 17, 18 తేదీల్లో పెగిడపల్లి, గుంటూరు, విజయవాడ మీదుగా మళ్లించినట్లు దక్షిణమధ్య రైల్వే అధికారులు ప్రకటన విడుదల చేశారు. ప్రయాణికులు రైల్వే శాఖకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

పనులు ఫుల్.. అలవెన్సులు నిల్..

» అదనపు ఖర్చుతో సతమతం అవుతున్న జిల్లా సైన్స్ అధికారులు
» పాఠాలు చెబుతూనే సైన్స్ కార్యక్రమాలు
» ప్రభుత్వం తమ ఇబ్బందులను పట్టించుకోవడం లేదని ఆవేదన
» రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఇదే పరిస్థితి

భూపాలపల్లి టౌన్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ఒకవైపు పాఠాలు బోధించాలి.. మరోవైపు సైన్స్ అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించాలి.. దీంతో అధికారం లేని జిల్లా సైన్స్ అధికారులకు అధిక పనిభారం పడుతోందనే వాదనలు వినిపిస్తున్నాయి. వారు నిర్వహిస్తున్న అదనపు బాధ్యతలకు అదనపు వేతనాలు కానీ, అలవెన్సులు కానీ లేవు. ఏదైనా అత్యవసర కార్యక్రమం చేయాల్సి వస్తే తామే ఖర్చులు భరించుకోవాల్సి వస్తోందనే వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలోని 33 జిల్లాల్లో అదే దుస్థితి దాపురించిందని చెబుతున్నారు.

తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించాక ఎంతో మంది ఉద్యోగులు, నిరుద్యోగులు సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఉద్యోగులైతే తమకు ప్రమోషన్లు వస్తాయని ఎంతో సంబురపడ్డారు. కానీ, అది ఎంతోకాలం నిలవలేదు. జిల్లా సైన్స్ అధికారుల పరిస్థితే ఇందుకు నిదర్శనం. రాష్ట్ర వ్యాప్తంగా 33 జిల్లాల్లో 33 మందిని జిల్లా సైన్స్ అధికా రులుగా అప్పటి ప్రభుత్వం సైన్స్ ఉపాధ్యాయులను ఎంపిక చేసింది. ఈ ప్రక్రియ రాష్ట్ర విభజన జరిగి జిల్లాలుగా ఏర్పడ్డ 2016 అక్టోబరు 11 నుంచి కొనసాగుతోంది. అయితే.. నాటి నుంచి వారి గురించి పట్టించుకున్న నాథులే లేకుండా పోయారు. 2017లో ఒకసారి సమగ్రశిక్షా ఆధ్వర్యంలో వీరికి రాత పరీక్ష కూడా నిర్వహించారు. కానీ ఎంపిక విధానంలో వారిపై సవతి ప్రేమే చూపించారు అప్పటి పాలకులు. దీంతో అప్పటి నుంచి వారికి ప్రమోషన్లు కానీ, పూర్తి బాధ్యతలు కానీ అప్పగించిన దాఖలాలు లేవు.



భూపాలపల్లిలో సైన్స్ ఫెయిర్‌ను పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

అదనపు బాధ్యతలు

తాము ప్రతి సంవత్సరం కనీసం 50 నుంచి 60 సైన్స్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, అయినా తమపై ప్రభుత్వాలకు చిత్తశుద్ధి లేదని అంటున్నారు సైన్స్ అధికారులు. పైగా ఒకవైపు పాఠాలు బోధించుకుంటూనే మరోవైపు సైన్స్‌ఫెయిర్‌లు నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశిస్తోందని అంటున్నారు. కానీ తమకు ఎంత పనిభారం పడుతుందో అర్థం చేసుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బాధ్యతలు అదనంగా ఉన్నా వేతనం మాత్రం అదనంగా ఇవ్వడం లేదని అంటున్నారు. పైగా ఏదైనా అత్యవసర సమయాల్లో సైన్స్ కార్యక్రమాలు చేయాల్సి వస్తే దానికి తామే సొంత ఖర్చులు భరించుకోవాల్సి వస్తోందని వాపోతున్నారు.

విధులు.. విధానాలు..

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టే ప్రతీ సైన్స్ కార్యక్రమాన్ని తూచా తప్పకుండా జిల్లా సైన్స్ అధికారులు చేయాల్సిందే. కానీ వారికి పూర్తి బాధ్యతలు అప్పగించలేదు. అయితే ఈ సైన్స్ అధికారులు జిల్లాల్లో నిర్వహించే సెమినార్లకు, డ్రామా కండక్ట్, చిల్డ్రన్ సైన్స్ కాంగ్రెస్ కార్యక్రమాలు, స్కూల్ ఇన్నోవేషన్ మారథాన్, ఇన్స్‌పెయిర్‌మనక్, ఎగ్జిబిషన్లు తదితర వాటితో పాటు నేషనల్ గ్రీన్ కోర్‌కు సంబంధించిన కార్యక్రమాలు కూడా చేయాల్సి ఉంటుంది. ఇవి సంవత్సరం పొడవునా కొనసాగుతాయని తెలిపారు. అయినా తమపై కనికరం లేదని చెబుతున్నారు.

అంతా ఇన్‌చార్జిలే..

రాష్ట్రంలోని 33 జిల్లాల్లో పనిచేసే జిల్లా సైన్స్ అధికారులంతా ఇన్‌చార్జిలే కావడం గమనార్హం. పైగా కొంతమంది వారు పనిచేస్తున్న పాఠశాల్లో పాఠాలు బోధిస్తూనే మరోవైపు సైన్స్ కార్యక్రమాలు నిర్వహించే దుస్థితి దాపురించిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. సమగ్ర శిక్షలో ఒక్కో జిల్లాలో ఐదుగురు నుంచి ఆరుగురు చొప్పున సెక్టోరియల్ అధికారులను పూర్తిస్థాయిలో నియమించుకున్న ఉన్నతాధికారులు తమ పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు జాబ్ క్యాలెండర్ లేదని, సైన్స్ అభివృద్ధి కోసం ప్రత్యేకమైన ఫండ్ ఏమీ లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పైగా అటల్ టింకరింగ్ ల్యాబరేటరీస్‌పై కూడా పర్యవేక్షించాలనే ఆదేశాలు కూడా జారీ అయ్యాయని తెలుపుతున్నారు.

పూర్తి బాధ్యతలు అప్పగించాలి

- బర్ల స్వామి, ఇన్‌చార్జి జిల్లా సైన్స్ అధికారి



సైన్స్ రంగంలో విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దేందుకు వంద శాతం పని చేస్తున్నాం. మా శ్రమకు తగిన గుర్తింపు దక్కాలని కోరుతున్నాం. మాకు పూర్తి అధికారాలు అప్పగించాలి. ఒకవైపు పాఠాలు, మరోవైపు కార్యక్రమాలు నిర్వహించడం వల్ల అసంతృప్తికి గురవుతున్నాం. అదనపు బాధ్యతలతో అదనపు వేదనకు లోనవుతున్నాం. మా ఈ సమస్యపై దృష్టిసారించాలి.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

● సీఐటీయూ జిల్లా కార్యదర్శి కుంట ఉపేందర్

మహబూబాబాద్ టౌన్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : మునిసిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కుంట ఉపేందర్ డిమాండ్ చేశారు. మహబూబాబాద్‌లో తెలంగాణ మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా మహాసభను శనవారం ఆ సంఘం జిల్లా కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన కుంట ఉపేందర్ మాట్లాడుతూ అనేక సంవత్సరాలుగా తక్కువ వేతనంతో మునిసిపల్ కార్మికులచే వెట్టిచాకిరి చేయిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వాలు మారిన మునిసిపల్ కార్మికుల బతుకుల్లో వెలుగులు నిండడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కనీస వవేతనం అమలు చేయడంతో పాటు అర్హులైన వారికి పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ మహాసభలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజు, కుమ్మరికుంట్ల నాగన్న, పుచ్చకాయల ఎల్లయ్య, దాసరి మనోహర్, సైదులు, జాటోతు మంగిలాల్, పుష్పరాజ్, జగన్, శ్రీకాంత్, జానీ, పద్మ, వీరన్న, మంజుల, వెంకన్న, కృష్ణ, ఎల్లయ్య పాల్గొన్నారు.

మానుకోట పట్టణ కమిటీ ఎన్నిక..

సీఐటీయూ అనుబంధ తెలంగాణ మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ మానుకోట పట్టణ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కుమ్మరి కుంట్ల నాగన్న, కార్యదర్శిగా పుచ్చకాయల ఎల్లయ్య, కోశాధికారిగా దాసరి మనోహర్ ఎన్నుకున్నారు.



జిల్లా మహాసభలో మాట్లాడుతున్న కుంట ఉపేందర్

నారాయణ స్ఫూర్తితో ఉద్యమాన్ని

బలోపేతం చేద్దాం

● టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మల్లారెడ్డి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర పూర్వ అధ్యక్షులు, ప్రధానకార్యదర్శి, ఎస్‌టీఎఫ్ జాతీయ ఉపాధ్యక్షులు దివంగత నాగటి నారాయణ స్ఫూర్తితో ఉద్యమాన్ని బలోపేతం చేద్దామని టీఎస్-యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మల్లారెడ్డి పిలుపునిచ్చారు. మహబూబాబాద్‌లోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో శనివారం నాగటి నారాయణ తృతీయ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...నిరుపేద కుటుంబంలో జన్మించిన నారాయణ ఉపాధ్యాయ వృత్తిని చేపట్టి ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారానికి అలుపెరగని పోరాటం చేశారని పేర్కొన్నారు. నారాయణ ఆశయ సాధనకు పాటుపడుతూ సీపీఎస్ రద్దు కోసం ఉద్యమాన్ని బలోపేతం చేద్దామన్నారు. ఈ కార్యక్రమంలో యాకూబ్, హుస్సేన్, మంజుల, హరినాయక్, సంజీవ, కుమార్, రాజశేఖర్, ప్రవీణ్‌కుమార్, కృష్ణమూర్తి, లక్మయ్య, నాగేశ్వరరావు, రాంజీ, భరత్, సోమేశ్వర్, బాబు, హోంజీ, రాజు, అష్మత్ పాషా, రాంబాబు, వీరభద్రం పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన రాష్ట్ర సేవికా సమితి మహిళలు



సమావేశంలో మాట్లాడుతున్న కవిడి రమేష్

ఆర్‌ఎస్‌ఎస్ ప్రేరణతో రాష్ట్ర సేవికా సమితి

● సమాజ నిర్మాణంలో మహిళలు పాత్ర కీలకం ● ఖమ్మం విభాగ్ బౌర్దిక్ ప్రముఖ్ కవిడి రమేష్

గూడూరు, అక్టోబరు11 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) ప్రేరణతో రాష్ట్ర సేవికా సమితి ఏర్పడిందని ఖమ్మం విభాగ్‌బౌర్దిక్ ప్రముఖ్ కవిడి రమేష్ అన్నారు. గూడూరు అరవింద విద్యాలయంలో శనివారం రాష్ట్ర సేవికా సమితి మండలశాఖ ఆధ్వర్యంలో విజయదశమి ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1936లో లక్ష్మీబాయి కేల్కర్ సారథ్యంలో విజయదశమి రోజున రాష్ట్ర సేవికా సమితి స్థాపించబడిందన్నారు. దేశ నిర్మాణంలో పురుషులతో పాటు మహిళలు సమాన బరువు బాధ్యతలను నిర్వర్తిస్తున్నట్లు చెప్పారు. మహిళల్లో జాతీయ భావాలను పెంపొందించేందుకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. సమాజ, వ్యక్తి నిర్మాణం కోసం, అతిపెద్ద మహిళ విభాగంగా సేవికా సమితి గుర్తింపు పొందిందన్నారు. సమాజాభివృద్ధి వ్యక్తిద్వార మాత్రమే సాధ్యమన్నారు. వ్యక్తి నిర్మాణానికి మహిళలు ప్రముఖ పాత్రపోషిస్తున్నారని చెప్పారు. ముఖ్యంగా కుటుంబం ద్వార పిల్లల్లో నైతిక విలువలు, సమాజం పట్ల శ్రద్ధ, ఆసక్తులనుకల్పించడంలో మహిళల పాత్ర గర్వించదగిందన్నారు. కుటుంబ ప్రబోధన్ ద్వార ఈ ప్రక్రియ కొనసాగించే ప్రయత్నం జరుగుతుందన్నారు.సమాజంను పట్టిపీడిస్తున్న ప్లాస్టిక్ నివారణ, నీటి పొదుపు, మొక్కల పెంపకం గురించి వాటి ఆవిష్కతను వివరించడం జరిగిందన్నారు. దేశం మొత్తం కేవలం హక్కుల గురించి మాట్లాడుతూ.. పౌరులు తమ బాధ్యతను మరిచిపోతున్నటువంటితరుణంలో వారి బాధ్యతలను గుర్తించి బాధ్యతయుతమైన సమాజ నిర్మాణం గురించి చర్చించినట్లు పేర్కొన్నారు. హిందు సమాజం నేడు కులాల కొట్లాటలతో సామరస్యతను కోల్పోవడం జరుగుతుందన్నారు. అనంతరం సేవికా సమితి ఆధ్వర్యంలో ప్రదర్శించిన ప్రదర్శనను పలువురిని ఆకట్టుకున్నాయి. రాష్ట్ర సేవికా సమితి కార్యవాహిక సభ్యులు పింగిలి స్వరూపరాణి, జులూరి పావని, హంసావత్ త్రివేణి, దొడ్డ శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు కనీస వేతనం ఇవ్వాలి

● సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజు

మహబూబాబాద్ టౌన్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్రంలో అంగన్‌వాడీలకు నెలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ మహబూబాబాద్ ప్రాజెక్టు మహాసభను శనివారం కె. సులోచన అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆకుల రాజు మాట్లాడుతూ...పెరిగిన ధరల కనుగుణంగా అంగన్‌వాడీ టీచర్లకు కనీస వేతనం ఇవ్వడం లేదని ఆరోపించారు. అంగన్‌వాడీ వ్యవస్థను నిర్వీర్యం చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్రలు చేస్తున్నాయని దానికి వ్యతిరేకంగా ఐక్యఉద్యమాలకు శ్రీకారం చుట్టాలన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు దేవాన్ని తాకట్టు పెట్టి కార్మికుల అన్యాయం చేస్తుందని విమర్శించారు. అనంతరం యూనియన్ మానుకోట ప్రాజెక్టు కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షురాలిగా దారా సుజాత, అధ్యక్షురాలిగా సరోజ, కార్యదర్శిగా రోజా, కోశాధికారిగా హేమాతో పాటు 20మందితో కమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి కుంట ఉపేందర్, యూనియన్ జిల్లా కార్యదర్శి దార స్నేహబిందు పాల్గొన్నారు. కాగా వివిధ సంఘాల నుంచి తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్‌లో చేరిన వారికి కండువాలు సాదరంగా ఆహ్వానించారు.



యూనియన్‌లో చేరిన వారికి కండువాలు కప్పుతున్న సీఐటీయూ, యూనియన్ నేతలు

పిడుగుపాటుకు గురైన విద్యుత్‌లైన్ మరమ్మతు

కురవి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : సీరోలు మండల కేంద్రంలోని చెరువు మధ్యలో ఉన్న 33 కెవి మరిపెడ 1ఫీడర్‌పై పోల్ నెంబర్ -92పై గత కొన్ని రోజుల క్రితం పిడుగుపడి మూడు ఇన్సులేటర్‌లు దెబ్బతిన్నాయి. దెబ్బతిన్న మూడు ఇన్సులేటర్‌లను సీరోలు ఏఈ సునీల్ కుమార్ పర్యవేక్షణలో విద్యుత్ సిబ్బంది చెరువు మధ్యలో గంట పాటు శ్రమించి పునరుద్దరణ పనులు నిర్వహించారు. గొనెల వెంకన్న చెరువు మధ్యలో ఉన్న స్తంభం వద్దకు వెళ్లడానికి పడవ సాయం అందించడంతో విద్యుత్ సిబ్బంది పనులు పూర్తి చేయగలిగారు. ఈ కార్యక్రమంలో లైన్‌మెన్ వీరన్న, శ్రీనివాస్, ఏఎల్ఎంలు శ్రీనివాస్, హరిప్రసాద్, కార్మికులు జాగీర్, కస్నా పాల్గొన్నారు.

జడ్జీపై దాడికి యత్నం హేయనీయం

● టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రమేష్

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : భారతదేశ అత్యున్నత న్యాయ స్థానం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ భూషన్ రామకృష్ణ గవాయ్‌పై జరిగిన దాడి హేయనీయమనీ టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బలాష్టి రమేష్ శనివారం తెలిపారు. భారత రాజ్యాంగ నిబంధనలకు లోబడే తీర్పు ఇస్తారని, ఇటువంటి న్యాయమూర్తిపై దాడి చేయడం ప్రజాస్వామ్య మనగడకే ప్రమాదని పేర్కొన్నారు. ఇటీవల కాలంలో కొందరు వ్యక్తులు న్యాయ నిర్ణయాలను రాజకీయ, సామాజిక కోణాల్లో చూస్తూ విమర్శించడం తగదన్నారు. ప్రజలకు న్యాయ వ్యవస్థపై ఉన్న విశ్వాసాన్ని దెబ్బతీస్తున్నారన్నారు. ఇప్పటికైనా బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రమేష్ అన్నారు.

విద్యార్థులకు వాటర్ బాటిల్స్ పంపిణీ

కురవి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : కురవి హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీ యాజమాని గాలి అశోక్ కుమారుడు అఖిల్ వర్ధంతిని పురస్కరించుకుని నేరడ కేజీబీవీ ఇంటర్, టెన్త్ విద్యార్థులకు స్టీల్ వాటర్‌బాటిల్స్‌ను శనివారం అందించారు. డాక్టర్ మొక్షగుండం విశ్వేశ్వరయ్య వెల్ఫేర్ సొసైటీ చైర్మన్ షేక్.జానీ ఆధ్వర్యంలో విద్యార్థులకు వాటర్ బాటిల్స్‌ను అందించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వో సరస్వతి, వెంకటరెడ్డి, ప్రశాంత్, వీరన్న, ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్‌టీసీ టూర్ ప్యాకేజిలో విద్యార్థుల విహారయాత్ర

కేసముద్రం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం విలేజి జడ్పీహైస్కూల్ విద్యార్థులు ఆర్‌టీసీ టూర్ ప్యాకేజీలో శనివారం రామప్ప, లక్నవరం ప్రాంతాలకు విహారయాత్రకు వెళ్లారు. గ్రామానికి చెందిన ముదిరెడ్డి రమాదేవి, మాజీ జడ్పీటీసీ రావుల శ్రీనాథ్ రెడ్డి, ముదిరెడ్డి మురళీధర్‌రెడ్డిలు బస్సు రవాణా ఖర్చులు రూ.26వేలను అందించగా భోజన సౌకర్యం ఉపాధ్యాయులు కల్పించారు. ఈ కార్యక్రమానికి ఆర్‌టీసీ టూర్ ప్యాకేజీ ఆఫీసర్ ముదిరెడ్డి రఘోత్తంరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కేసముద్రం విలేజిలో విహారయాత్రకు బయలు దేరుతున్న విద్యార్థులు

కమ్యూనిటీ మీడియేటర్లు ప్రముఖ పాత్ర పోషించాలి

ప్రిన్సిపల్ సివిల్ న్యాయాధికారి స్వాతి మురారి

గార్ల, అక్టోబరు11 (ఆధ్రజ్యోతి) : సమాజంలో క్షణికావేశంలో వివిధ రకాల నేరాలకు పాల్పడే వ్యక్తులను, వారిని సక్రమైన మార్గంలో ఉంచేందుకు కమ్యూనిటీ మీడియేటర్లు ప్రముఖపాత్ర పోషించాలని మహబూబాబాద్ ప్రిన్సిపల్ సివిల్ న్యాయాధికారిని స్వాతి మురారి అన్నారు. శనివారం గార్లలో కమ్యూనిటీ మీడియేషన్ సెంటర్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలిసితెలియక నేరాలకు పాల్పడే వ్యక్తులు తక్షణం న్యాయం జరిగే విధంగా శిక్షణ పొందిన కమ్యూనిటీ మీడియేటర్లు వివాదాలను పరిష్కారం చూపేవిధంగా స్పందించాలన్నారు. పూర్వకాలంలో గ్రామాల్లో కమ్యూనిటీ పెద్దలంటే ఎంతో గౌరవం ఉండేదని వారుఇచ్చే రచ్చబండ తీర్పులకు చట్టభద్రత లేకపోయినా పెద్దలపై గౌరవంతో అందరు కలసి మెలిసి ఉండేవారన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శారద, ఎంపీడీవో మంగమ్మ, ఎస్సై రియాజ్ పాషా, లాయర్లు జంపాల విశ్వకృష్ణారెడ్డి, కమ్యూనిటీ మిడీయేటర్లు అలవాల రామకృష్ణ, మురళి, గ్రామ పెద్దలు గంగావత్ లక్ష్మణ్ నాయక్, కందునూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



కమ్యూనిటీ మిడియేషన్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న స్వాతి మురారి

ప్రతీ ఆదివారం పంచారామాల భక్తియాత్ర

తొర్రూరు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఆధ్వర్యంలో కార్తీక మాసం సందర్భంగా పంచారామాల బస్సు యాత్రను తొర్రూరు ఆర్టీసీ డిపో పరిధిలో ఏర్పాటు చేస్తున్నట్లు డిపో మేనేజర్ పద్మావతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ యాత్ర ప్రతి ఆదివారం రాత్రి 8:00 గంటలకు తొర్రూరు డిపో నుంచి బయలు దేరి సోమవారం పంచారామాల దర్శనం చేసుకుని మంగళవారం తిరిగి తొర్రూరుకు చేరుకుంటుందన్నారు. ఈ యాత్రకు టికెట్ ధర రూ.2200 ఉంటుందని తెలిపారు. నవంబర్ 3వ తేదీన మధ్యాహ్నం 2 గంటలకు తొర్రూరు నుంచి బయలుదేరి కాణిపాకం, గోల్డెన్ టెంపుల్, సిరిపురం, అరుణాచలేశ్వరాలయం, తిరువన్నామలై, జోగుళాంబ, ఆలంపూర్, బీచుపల్లి ఆంజనేయస్వామి ఆలయాల ను దర్శించుకుని నవంబర్ 6వ తేదీన తిరిగి తొర్రూరుకు చేరుకుం టుందన్నారు. ఈ యాత్రకు టిక్కెట్ ధర ఒక్కొక్కరికి రూ.5,500 ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్:8074 474984, 70321 82456 నంబర్లలో సంప్రదించాలన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

మరిపెడ రూరల్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): తల్లీబిడ్డలు పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉష అన్నారు. శనివారం మండలంలోని ఎల్లంపేట అంగన్‌వాడీ సెంటర్‌లో పోషణ మాసం సంబురాల్లో భాగంగా గర్భిణులకు సీమంతాలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. అమ్మ ఒడి లాంటిది అంగన్‌వాడీ బడి అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలలో నాణ్యమైన విద్యతోపాటు, పౌష్టికాహారాన్ని ప్రభుత్వం అందజేస్తోందన్నారు. చిన్నారులు వయసు తగిన బరువు, ఎత్తు ఉన్నారా? లేకుంటే ఆ పిల్లలకు ఏ విధమైన ఆహారం ఇవ్వాలో తల్లిదండ్రులకు సూచిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు నవనీత, విజయకుమారి, జానకి, సుమతి, టి.శ్రీమతి, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ వర్కర్లు, గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

ఐపీఎస్ ఆత్మహత్యపై న్యాయ విచారణ జరపాలి

● కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు లచ్చన్న

మరిపెడ రూరల్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): హర్యానా రాష్ట్రంలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఐపీఎస్ అధికారి పోరన్‌కుమార్ ఆత్మహత్య చేసుకోవడం అత్యంత బాధాకరమని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు జిన్నా లచ్చన్న ఆవేదన వ్యక్త పరిచారు. శనివారం మండల కేంద్రంలో బాణాల ఎల్లయ్య అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఐపీఎస్ అధికారి స్థాయిలో కూడా దళితుడికి ఇంత అవమానం జరిగితే ఇక సామాన్య దళితుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ఐపీఎస్ అధికారి మృతిపై సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాగరాజు, వెంకటేష్, నవీన్, శ్రీనివాస్, వెంకన్న, మైసయ్య తదితరులు పాల్గొన్నారు.

తండ్రికి తలకొరివి పెట్టిన కూతురు

కేసముద్రం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెనుగొండలో ముత్యం రమేష్(42) అనారోగ్యంతో శనివారం మృతి చెందగా ఆయనకు భార్య ఉమ, కూతురు స్పందన ఉన్నారు. దీంతో డిగ్రీ చదువుతున్న కూతురు స్పందన తండ్రికి తలకొరివి పెట్టారు.

గీత కార్మికులకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి

● కల్లు గీత కార్మిక సంఘం జిల్లా నాయకుడు మోహన్

చిన్నగూడూరు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం కల్లు గీత కార్మికులకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని కల్లు గీత కార్మిక సంఘం జిల్లా నాయకుడు మోహన్ అన్నారు. చిన్నగూడూరులో శనివారం నిర్వహించిన మండల 4వ మహాసభలో ఆయన మాట్లాడారు. కల్లు గీత కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ముఖ్యమంత్రి, మంత్రులకు ఎన్ని సార్లు విన్నవించినా పట్టించుకోవడంలేదన్నారు. బతుకుదెరువు కోసం ప్రమాదకరమై నప్పటికీ గీత కార్మికులు తాడిచెట్లు ఎక్కుతున్నారని పేర్కొన్నారు. తాటి చెట్ల మీది నుంచి పడి మృతి చెందిన, వికలాంగులైన వారికి రావాల్సిన ఎక్స్ గ్రేషియో ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్నాయ న్నారు. ప్రమాదాలు నివారించడానికి ప్రభుత్వం ఇస్తున్న కాటమ య్య రక్షణ కవచాలు ఏడాది గడిచినా ఇరవై వేలు మించలేదన్నా రు. ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం పెన్షన్ రూ.4 వేలు, ఎక్స్ గ్రేషియా రూ.10 లక్షలకు, మద్యం షాపు టెండర్లలో 25శాతం పెంచాలన్నారు. సాఫ్ట్ డ్రింక్‌లను ఉత్పత్తి చేసే బడా కార్పొరేట్ కంపెనీలు కోట్లాది రూపాయలు ప్రజల నుంచి దండుకుంటున్నాయన్నారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ఒక్క పథకమైనా గీత కార్మికుల సంక్షేమానికి ప్రవేశ పెట్టిందా అని, తామే పెంచిన జీఎస్టీని తగ్గించి ప్రజలు పండుగ చేసుకోండని ప్రధాన మంత్రి చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నీరా, తాటి ఉత్పత్తులను ప్రోత్సహించి యువతి, యువకులకు ఉపాధి కల్పించాలన్నారు. అనంతరం మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా గుణగాని వేణు, సలహాదారుగా భర్తపురం కొమురెల్లి, గౌరవ ఆహ్వానితుడిగా గాడిపెల్లి నరసయ్య, కేజీకేఎస్ మండల అధ్యక్షుడిగా బత్తిని రమేశ్, ఉపాధ్యక్షుడిగా బెల్లంకొండ శ్రీను, ప్రధాన కార్యదర్శిగా గంధసిరి వెంకన్న, సహాయ కార్యదర్శిగా గునిగంటి కృష్ణ, ఆర్గనైజర్‌గా గాడిపెల్లి వెంకన్న, కో-ఆప్షన్ సభ్యులుగా బొమ్మకంటి వెంకట్, గుదె సంపత్, సోషల్ మీడియా కన్వీనర్‌గా ముత్యం రంజిత్, కో-కన్వీనర్లుగా గాడిపెల్లి జీవన్, చేగోని రవీందర్, మహేశ్‌లను ఎన్నుకున్నారు. నాగేశ్, కృష్ణ, యాకయ్య, అప్పయ్య, సోమన్న పాల్గొన్నారు.



కల్లుగీత కార్మిక సంఘం మండల సమావేశంలో మాట్లాడుతున్న మోహన్

డబుల్ బెడ్‌రూమ్‌లు పంచేవరకు పోరాటం

తొర్రూరు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): తొర్రూరులో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను పేదలకు పంచాలని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీని అధికారులు నిలబెట్టుకోవాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బొల్లం అశోక్, ఎమ్డీ.యాకూబ్ అధికారులను డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో గోపాలగిరి రోడ్డులో నిర్మించిన 284 డబుల్ బెడ్‌రూం ఇళ్లను లబ్ధిదారులకు అందించాలని సీపీఎం తొర్రూరు మండల కమిటీ ఆధ్వర్యంలో ఎన్నికల కోడ్ అనంతరం రెండో విడత డబుల్ బెడ్‌రూం ఇళ్ల వద్ద లబ్ధిదారులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డబుల్ బెడ్ రూం ఇళ్లు పంచేవరకు పోరాటం ఆగదని, అధికారుల మాట ప్రకారం ఎన్నికల కోడ్ పంచుతామన్న హామీని అధికారులు నిలబెట్టుకోవాలని, ఇళ్ల నిర్మాణం పూర్తయి శిథిలావస్థకు చేరుకున్నాయని, కాంగ్రెస్ హయాంలోనైనా ఇళ్లు పంచుతారో లేదో అని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే డబుల్ బెడ్‌రూం ఇళ్లను పంపిణీ చేయాలన్నారు. కొమ్మనబోయిన యాకయ్య, డొనుక దర్గయ్య, శ్రీను, రవి, సోమయ్య, శోభ, ధర్మయ్య, సాయిలు, అరుణ, షమీన, రేణుక, భవాని, నాగమణి, శ్రీను, వసంత ఉన్నారు.



డబుల్ బెడ్‌రూమ్‌ల వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు

రూ.2 లక్షలు రుణమాఫీ చేసింది కాంగ్రెస్సే

పాలకుర్తి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రైతుల రూ.2లక్షల వరకు రుణమాఫీ చేసిందని ఒక్క కాంగ్రెస్ ప్రభుత్వమేనని ఆ పార్టీ మండల అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణతో కలిసి మాట్లాడారు. పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేయలేనిది ఏడాదిలోనే అనేక సంక్షేమ పథకాలు అమలు చేసిందన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు కలిసి బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ఇవ్వకుండా అడ్డుకుంటున్నాయని ఆరోపించారు. సమావేశంలో నాయకులు పోగు శ్రీనివాస్, మాజీ జెడ్పీకోఆప్షన్ సభ్యుడు మదార్, మాజీ ఎంపీపీ కారుపోతుల శ్రీనివాస్, లావుడ్యా భాస్కర్, మంజుల, గాదెపాక భాస్కర్, పెనుగొండ రమేష్, బొమ్మగాని భాస్కర్, నలమాస రమేష్ ఉన్నారు.

అభివృద్ధి సంక్షేమమే మోదీ లక్ష్యం

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు యాప సీతయ్య

మహబూబాబాద్ రూరల్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : ప్రధాని మోదీ అభివృద్ధి, సంక్షేమం కోసం కృషి చేస్తున్నారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు యాప సీతయ్య అన్నారు. మహబూబాబాద్ రైల్వే స్టేషన్ ఆవరణలో బీజేపీ అర్బన్ అధ్యక్షుడు వెన్నమల్ల అజయ్ అధ్యక్షతన మోదీ ఫ్లెక్సీకి శనివారం క్షీరాభిషేకం చేశారు. బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు క్యాచువల్ శ్యాంసుందర్‌శర్మ, బోయినపల్లి లక్ష్మణ్‌రావు, వలపదాసు భద్రయ్య, పద్మ, రేష్మ, రవియాదవ్, మల్లం యశ్వంత్, శివ, సమ్మయ్య, సరోజన, కవిత, రేఖ, నాగమణి, గంగమ్మ పాల్గొన్నారు.

గంజాయి ముఠా అరెస్టు

మహబూబాబాద్ క్రైం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయిస్తున్న ముఠా సభ్యులను అరెస్టు చేసి, ఒక ద్విచక్రవాహనం, ఐదు సెల్‌ఫోన్ లను సీజ్ చేసినట్లు సీఐ మహేందర్‌రెడ్డి తెలిపారు. శనివారం టౌన్ పోలీస్‌స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. మహబూబాబాద్‌లో ఎస్సై మౌనిక, సిబ్బందితో కలిసి పెట్రోలింగ్ చేస్తుండగా నిజాం చెరువు కట్ట సమీపంలో ఐదుగురు యువకులు అనుమానాస్పదంగా ఉండి పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించారు. సిబ్బంది సహకారంతో వారిని పట్టుకొని విచారించగా, కురవి మండలం తోకబోడు తండాకు చెందిన లునావత్ రవీందర్, పట్టణంలోని అయ్యప్ప టెంపుల్ ఏరియాకు చెందిన భూక్య వినోద్, కాకతీయ కాలనీకి చెందిన లావూడ్య పవన్, భవాని నగర్‌తండాకు చెందిన భూక్య కుమార్, కురవి మండలం జగ్యాతండకు చెందిన భూక్య సాయిరాంలు ముఠాగా ఏర్పడ్డారు. మరిపెడ మండలం వీరారం తండకు చెందిన బాదావత్ ప్రశాంత్ భద్రాచలం, అరకు ప్రాంతాల నుంచి ఎండు గంజాయిని తీసుకువచ్చి ఆ ముఠా సభ్యులకు అందజేసేవాడన్నారు. వీరి వద్ద నుంచి 2.5 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నామని, ఎండు గంజాయి విలువ సుమారు. రూ. 1.27 లక్షలు ఉంటుందన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని, ఒక ద్విచక్రవాహనం, 5 సెల్ ఫోన్‌లను సీజ్ చేసినట్లు సీఐ తెలిపారు. ఎస్సై మౌనికను, సిబ్బందిని సీఐ అభినందించారు.